ఎన్నికలకు సిద్ధం

అవనిగడ్డ, మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల అభ్యర్థులుగా సింహాద్రి రమేష్‌బాబు, పేర్ని కిట్టు, ఉప్పాల రాము

రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులను, 24 మంది ఎంపీ అభ్యర్థులను శనివారం ఇడుపులపాయలో ఆ పార్టీ అధ్యక్షుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. దానిలో భాగంగా కృష్ణా జిల్లాలోని అవనిగడ్డ, మచిలీపట్నం, పెడన నియోజకవర్గ అభ్యర్థులుగా సింహాద్రి రమేష్‌బాబు, పేర్ని కృష్ణమూర్తి(కిట్టు), ఉప్పాల రమేష్ (రాము)ను ప్రకటించారు.

ఉద్యమ సారథి సింహాద్రి రమేష్‌బాబు



అవనిగడ్డ: వైఎస్సార్ సీపీ అవనిగడ్డ నియోజకవర్గ అభ్యర్థిగా ప్రకటించిన సింహాద్రి రమేష్‌బాబు విద్యార్థి ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించారు. ఆయన కుటుంబ నేపథ్యమిది. అవనిగడ్డ మండలం బందలాయి చెరువు రమేష్‌బాబు స్వగ్రామం. ఆయన గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఆయన భార్య కెప్టెన్ లక్ష్మి. వారికి కుమారుడు, ముగ్గురు కుమార్తెలు. ఆయన.. వ్యవసాయం, రొయ్యల సాగు చేస్తుంటారు.

రాజకీయ జీవితం

విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించారు. పీడీఎస్ నాయకుడిగా పని చేశారు. సనకా బుచ్చికోటయ్య నిర్వహణలోని సీపీఐ(ఎంఎల్) పార్టీలో క్రియాశీల నాయకునిగా వ్యవహరించారు. పులిగడ్డ – పెనుమూడి వారధి సాధనకు చేపట్టిన కోస్తా రాస్తా ఉద్యమానికి కన్వీనర్‌గా ఉన్నారు. 2009లో తొలిసారిగా అవనిగడ్డ నియోజకవర్గం నుంచి ప్రజారాజ్యం తరుపున పోటీచేసి ఓడిపోయారు. 2014లో వైఎస్సార్ సీపీ తరుపున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2019లో 20,572 రికార్డు స్థాయి మెజారిటీతో ఘన విజయం సాధించారు. 22ఏ నిషేధిత భూముల సమస్య పరిష్కారంలో కీలక పాత్ర పోషించారు. కోవిడ్ సమయంలో అవనిగడ్డ ఏరియా వైద్యశాలలో కోవిడ్ కేంద్రం ఏర్పాటుతో పాటు ఆక్సిజన్ కొరత లేకుండా చూడటం ద్వారా జిల్లాలోనే గుర్తింపు పొందారు. అవనిగడ్డలో కిడ్నీ డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేశారు.

అవనిగడ్డలో సంబరాలు

అవనిగడ్డ సీటు సిట్టింగ్ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుకు ప్రకటించడంతో పార్టీ కార్యాలయం వద్ద శనివారం రాత్రి సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే రమేష్‌బాబు నాయకులు, కార్యకర్తలకు స్వీట్లు తినిపించారు. పలువురు నేతలు పాల్గొన్నారు.

బందరు ప్రజల సంక్షేమానికి కిట్టు కృషి



మచిలీపట్నం: వైఎస్సార్ సీపీ బందరు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా పేర్ని వాకా సాయి కృష్ణమూర్తిని ప్రకటించారు. ఆయన వయసు 27 ఏళ్లు. ఆయన కుటుంబ, రాజకీయ నేపథ్యమిది. ఆయన తల్లిదండ్రులు బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య(నాని), జయసుధ. ఇంజినీరింగ్ చదివిన కిట్టు వైఎస్సార్ సీపీ బందరు ఇన్‌చార్జిగా ఉన్నారు. ఆయన తాత పేర్ని కృష్ణమూర్తి మాజీ మంత్రి, బందరు మాజీ ఎమ్మెల్యేగా చేశారు.

రాజకీయ నేపథ్యం

అటు తాత, ఇటు తండ్రి ఆలోచనలు, అడుగులు పుణికిపుచ్చుకున్న పేర్ని వాకా సాయి కృష్ణమూర్తి (కిట్టు) రాజకీయ నాయకుడిగా ప్రజలకు సేవలు అందించాలనుకున్నారు. తల్లిదండ్రుల అంగీకారంతో వారి సంపూర్ణ మద్దతుతో వైఎస్సార్ సీపీలో చేరారు.

సామాజిక సేవ

వైఎస్సార్ సీపీ తరఫున ప్రజలకు సేవ చేయడం మొదలుపెట్టిన నాటి నుంచి నేటి వరకు ఎన్నో సామాజిక అభివృద్ధి కార్యక్రమాలకు పేర్ని కిట్టు శ్రీకారం చుట్టారు. తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ ఆయన సలహాలు, సూచనలు పాటిస్తూ పార్టీ పరంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలతో పాటు బందరు ప్రజల సంక్షేమానికి కిట్టు విశేష కృషి చేస్తున్నారు. బందరు ప్రాంత అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఒప్పించి రూ. 20 కోట్లు నిధులను తెచ్చారు. ఇండోర్ స్టేడియం, కమ్యూనిటీ హాళ్లు, రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కోవిడ్ సమయంలో ప్రజలకు సేవ చేశారు. బందరు ప్రభుత్వాసుపత్రితో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో కోవిడ్ చికిత్స సెంటర్లను ఏర్పాటు చేయించి అనేక మంది నియోజకవర్గ ప్రజలకు వైద్య సేవలు అందించి కోవిడ్ నుంచి వారు బయటపడటానికి కృషి చేశారు.

ప్రజా సమస్యలు పరిష్కారం

రాజకీయాల్లోకి అడుగు పెట్టిన నాటి నుంచి పేర్ని కిట్టు తన తండ్రి నాని అడుగుజాడల్లో నడుస్తూ ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను తన సమస్యలుగా భావిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. దీంతో ప్రజలకు దగ్గరయ్యారు. విద్యావంతుడు, మృదుస్వభావి, స్నేహశీలి, మరి ముఖ్యంగా కలుపుగోలుదనంతో ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు.

పెడనలో.. అంకితభావంతో సేవ



పెడన: నియోజకవర్గ అభ్యర్థి ఉప్పాల రమేష్(రాము) అంకితభావంతో ప్రజలకు సేవలందిస్తున్నారు. ఆయన కుటుంబ, రాజకీయ నేపథ్యమిది. ఆయన డిగ్రీ వరకు చదివారు. ఆయన తల్లిదండ్రులు ఉప్పాల రాంప్రసాద్, నాగమణి. ఆయన భార్య హారిక కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్. ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు.

రాజకీయ నేపథ్యమిది

మల్లేశ్వరం, పెడనలో దాదాపు 40 సంవత్సరాలుగా రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం కావడంతో నియోజకవర్గ ప్రజలకు చిరపరిచితులు. టీడీపీలో సరైన గుర్తింపు, ప్రాతినిధ్యం లేక పోవడంతో వైఎస్సార్ సీపీ ఆవిర్భావంతో ప్రారంభంలోనే ఆయన తండ్రి పార్టీలో చేరారు. అప్పటి నుంచి వైఎస్సార్ సీపీ బలోపేతానికి, జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా కృషి చేశారు. రాంప్రసాద్ కుటుంబం అంకితభావానికి, సేవలకు మెచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలను రాంప్రసాద్‌కు అప్పగించారు. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో కైకలూరు నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా ఉప్పాల రాంప్రసాద్ 2014లో పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత డీసీఎంఎస్ చైర్మన్‌గా బాధ్యతలను నిర్వహించారు. రాము భార్య ఉప్పాల హారిక ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రాము 2013లో వైఎస్సార్ సీపీ అదనపు సమన్వయకర్తగా తండ్రి రాంప్రసాద్‌తో కలిసి విధులు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ యువ నాయకుడిగా రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా పదవీ బాధ్యతలను నిర్వహించారు. రాము భార్య ఉప్పాల హారిక గుడ్లవల్లేరు నుంచి జెడ్పీటీసీ సభ్యురాలిగా ఎన్నికయ్యారు.

సేవా కార్యక్రమాలు

నిరుపేదలు ఎవరైనా చదువులకు ఆర్థిక సాయం కావాలని కోరిన వెంటనే స్పందిస్తూ ఎంతో కొంత ఆర్థిక సాయం చేస్తూ వస్తున్నారు. ఆయన తండ్రి ఉప్పాల రాంప్రసాద్ కూడా ఇలాగే సాయం చేశారు. ఇదే విధానాన్ని రాము కూడా కొనసాగిస్తున్నారు. చదువే కాకుండా అనారోగ్య విషయంలో కూడా స్పందిస్తూ సాయం అందిస్తున్నారు. దేవాలయాల నిర్మాణాలకు, ఇళ్లు కాలిపోయిన బాధితులకు కూడా ఆర్థిక సాయం చేస్తున్నారు.

మంచికి మారుపేరు

రాంప్రసాద్ కుటుంబం అంటేనే మంచికి మరో పేరు. అటువంటి కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి రాము. ఎటువంటి భేషజాలు లేకుండా ప్రజలతో మమేకమయ్యే వ్యక్తి. అందరితోను కలివిడిగా మాట్లాడతారు. పెడన నియోజకవర్గంలోని వ్యక్తే కావడంతో ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటారనే పేరుంది.

క్లుప్తంగా

జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీగా ఫణికేశవరావు



చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం జిల్లా కోర్టులోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా సీహెచ్వీ ఫణికేశవరావును నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. తనను అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని)కు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

పెడనలో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెడన: పట్టణంలోని గూడూరు రోడ్డులో విద్యుత్ లైన్ల నిర్వహణ కారణంగా శనివారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ జయరామ్ తెలిపారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

ఇళ్ల పట్టాల పంపిణీ



మోపిదేవిలంక(మోపిదేవి): నవరత్నాలు.. అందరికీ ఇళ్లులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినట్లు సర్పంచ్ మోర్ల జ్యోత్స్న తెలిపారు. మండలంలోని మోపిదేవిలంక పంచాయతీలో 26 మంది లబ్ధిదారులకు శనివారం ఇళ్ల పట్టాలు అందజేశారు. ఇచ్చిన మాట నిలుపుకున్న జగనన్నకు, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థికి ఓట్లు వేసి అత్యధిక భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని సూచించారు. జిల్లా కార్యదర్శి మోర్ల శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ ధనుంజయరావు, వీఆర్వో మత్తి గోపాల కృష్ణ, సచివాలయ సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ మహేష్ పాల్గొన్నారు.

పెళ్లి కానుక అందజేత

వెంకటాపురం(మోపిదేవి): వెంకటాపురంలోని శ్రీ హనుమాన్ లక్ష్మణ సీతా సమేత కోదండ రామస్వామి దేవాలయంలో వివాహం చేసుకున్న నూతన వధూవరులు లక్ష్మీదుర్గ, గోపీకృష్ణకు రూ.10 వేలు పెళ్లి కానుకగా అందజేశారు. ఆలయ ప్రాంగణంలో శనివారం జరిగిన కార్యక్రమంలో కోనేరు వెంకట్రామయ్య చారిటబుల్ ట్రస్ట్ తరపున ట్రస్టీ వ్యవస్థాపకులు కోనేరు సరోజిని.. పెళ్లి కానుక అందించినట్లు తెలిపారు.

రాఘవేంద్రస్వామికి ప్రత్యేక పూజలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని రాబర్ట్‌సన్‌పేటలో వేంచేసియున్న శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఉపాలయంగా ఉన్న శ్రీ రాఘవేంద్రస్వామికి పాలతో, పంచామృతాలతో శనివారం అభిషేకాలు చేశారు. 108 లీటర్ల పాలతో అభిషేకం చేసి పలు రకాల పూలతో అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమాన్ని ఈవో బి.సుబ్బారెడ్డి పర్యవేక్షించారు.

పృథ్వీశ్వరుని హుండీ ఆదాయం లెక్కింపు

నడకుదురు(చల్లపల్లి): శ్రీ పృథ్వీశ్వర స్వామి వారి దేవస్థానంలో శనివారం హుండీ ఆదాయం లెక్కించారు. మూడు నెలలకు రూ.60,395 ఆదాయం లభించింది. సర్పంచ్ గొరిపర్తి సురేష్ బాబు, దేవదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమం

బంటుమిల్లి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమం జరుగుతుందని ఆయన వస్తేనే పేదల మోముల్లో సంతోషం ఉంటుందని జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, వైఎస్సార్ సీపీ పెడన ఇన్‌చార్జి ఉప్పాల రాము పేర్కొన్నారు. కృత్తివెన్ను మండలం మాట్లం గ్రామంలో శనివారం జరిగిన ప్రజాదీవెనలో వారు పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వంలో జరిగిన లబ్ధిని ప్రజలకు వివరించారు. మీ కుటుంబాల్లో జరిగిన మంచిని మేలును తలుచుకుని ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా ఆశీర్వదించడంతోపాటు పెడన ఎమ్మెల్యేగా ఉప్పాల రామును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



మాట్లం గ్రామంలో ప్రజాదీవెనలో లబ్ధిదారులకు కరపత్రాలు అందజేస్తున్న హారిక, రాము

కృత్తివెన్ను: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందారని ఉప్పాల హారిక, ఉప్పాల రాము అన్నారు. శనివారం కృత్తివెన్ను మండలం మాట్లం గ్రామంలో రూ. 43.60 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని వారు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామ సభలో వారు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ హయాంలో గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ కృష్ణ జోనల్ చైర్మన్ పిన్నింటి మహేష్, ఎంపీపీ కె. గరుడ ప్రసాదు, ఏఎంసీ చైర్మన్ కె. గంగాధర్, పార్టీ కన్వీనర్ వై. వెంకటరాజు, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, మాట్లం పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ కన్వీనరు జాన్‌రత్నం స్థానిక నాయకులు టి. ఏడుకొండలు, రమణమూర్తి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాలలో నేను సిద్ధం .. నా బూత్ సిద్ధం

ఘంటసాల: త్వరలో జరగబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి చెందిన ప్రతి కార్యకర్త, పోలింగ్ బూత్ సభ్యులు సిద్ధంగా ఉండాలని ఘంటసాల మార్కెట్ కమిటీ చైర్మన్ వేమూరి వెంకట్రావు అన్నారు. ఘంటసాలలో నేను సిద్ధం – నా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ వెంకట్రావు మాట్లాడుతూ సీఎం జగనన్న ఆదేశాల మేరకు వచ్చే ఎన్నికల్లో వైనాట్ 175కు అనుగుణంగా క్షేత్రస్థాయిలో ఓటర్లను సిద్ధం చేసుకునేలా బూత్ కమిటీ సభ్యులకు అవగాహన కల్పించామన్నారు. ఘంటసాల మండలంలో 44 పోలింగ్ బూత్‌ల్లో నేతలు, కార్యకర్తలు ఉత్సాహంగా ఉన్నారని తెలిపారు. అనంతరం ఆయా బూత్ సభ్యులకు నేను సిద్ధం – నా బూత్ సిద్ధం కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ సచివాలయాల మండల కన్వీనర్ వేమూరి ప్రవీణ్, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు వేమూరి రత్నశేఖర్, పరుచూరి రామకృష్ణ, పోలింగ్ బూత్ సభ్యులు చందోలు సత్యం, భావనరుషి, నడకుదురు గాంధీ, సీతారాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



ఘంటసాలలో 'సిద్ధం' కిట్లను అందిస్తున్న ఏఎంసీ చైర్మన్ వెంకట్రావు, ప్రవీణ్

52 మందికి ఉచిత కంటి పరీక్షలు

చల్లపల్లి: కోమలనగర్‌లోని లయన్స్ క్లబ్ ఆఫ్ చల్లపల్లి వీఆర్‌కే నగర్ కార్యాలయంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వైద్యులు మోహనరావు 52 మందికి కంటి పరీక్షలు చేసి 15 మందికి కంటి శుక్లాల ఆపరేషన్లు చేయాలన్నారు. క్లబ్ పెద్దలు దుబ్బుల సాంబశివరావు ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన శిబిరంలో 15 మందికి గూడూరు సాయి నేత్రాలయంలో ఉచితంగా ఐఓఎల్ ఆపరేషన్లు చేయిస్తామని లయన్స్ జిల్లా నాయకులు సాయిబాబు తెలిపారు. శిబిరాన్ని క్లబ్ పెద్దలు తగిరిశ సాంబశివరావు, కొల్లిపర మధు, ఏఎల్ ఆర్‌కే ప్రసాద్, వరదా హరిగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి

పెడన: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని డైట్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ఎం.వి.జి.ఆంజనేయులు కోరారు. పదో తరగతి పరీక్షలు పురస్కరించుకుని స్థానిక విశ్వశాంతి హైస్కూల్ విద్యార్థుల ఆధ్వర్యంలో సరస్వతీ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ గౌరీప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అప్సా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాబు జాన్, బందరు డివిజన్ అధ్యక్షుడు కె.వి.జాన్, విద్యావేత్త ఉమ్మిటి విద్యాధర్, హరీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

తెలుగురావుపాలెం పంచాయతీ కార్యదర్శిగా అశ్విన్‌కుమార్

ఘంటసాల: తెలుగురావుపాలెం పంచాయతీ కార్యదర్శిగా బొల్ల జేజి అశ్విన్ కుమార్ నియమితులయ్యారు. ఇటీవల ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శుల పోస్టులను భర్తీ చేసేందుకు గ్రామ సచివాలయాల్లో గ్రేడ్ 5 కార్యదర్శులుగా చేస్తున్న వారిని సంబంధిత పంచాయతీల్లో కార్యదర్శిగా నియమించాలని ఉత్తర్వులు జారీ చేశారు. దీనిలో భాగంగా ఆయన్ను ఇక్కడ నియమించారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

ఘంటసాల: గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలని మొవ్వ సీడీపీవో పి.భానుమతి అన్నారు. ఘంటసాల నందం బజార్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో ఘంటసాల సెక్టార్ పరిధిలో పోషన్ పక్వాడ కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఘంటసాల, చల్లపల్లి సెక్టార్ సూపర్‌వైజర్లు రమా నాగమణి, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అవ్వా బాగున్నావా.. ఆరోగ్యం ఎలా ఉంది..

'గడప గడప'లో ఆప్యాయంగా పలకరిస్తున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: అవ్వా బాగున్నావా.. ఆరోగ్యం ఎలా ఉంది.. పెన్షన్ సకాలంలో అందుతోందా.. తాత ఏంటి సంగతులు.. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన బాగా సాగుతోంది.. మీ అందరి సంక్షేమానికి అనేకసార్లు బటన్లు నొక్కిన జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకునేందుకు పెద్దలంతా సిద్ధంగా ఉన్నారా అంటూ వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కిట్టు గడప గడపకు వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. బందరు మండలంలోని తాళ్లపాలెం గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం జరిగింది. ఐదో రోజు కొనసాగిన కార్యక్రమంలో కిట్టు ఇంటింటికీ తిరిగి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పథకాల ఉపయోగాన్ని వివరించారు. అర్హులకు సంక్షేమ ఫలాలు అందుతున్నది లేనిది తెలుసుకున్నారు. అర్హత ఉండి సంక్షేమ ఫలాలు అందని వారు ఉంటే తెలియజేయాలని కోరారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. గ్రామంలోకి అడుగుపెట్టిన పేర్ని కిట్టుకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులు ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ వాలిశెట్టి రవిశంకర్, సర్పంచి మదిరి అశ్విని, కానూరు పీఏసీఎస్ అధ్యక్షుడు శ్రీకాకుళపు నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గడప గడపకు మన ప్రభుత్వంలో పథకాలపై అవగాహన కల్పిస్తున్న పేర్ని కిట్టు

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ శ్రేణులు

గూడూరు: గూడూరుకు చెందిన టీడీపీ నాయకుడు బత్తిన లక్ష్మీనరసింహస్వామి ఆధ్వర్యంలో 40 మంది కార్యకర్తలు శనివారం వైఎస్సార్ సీపీకి జై కొట్టారు. వైఎస్సార్ సీపీ పెడన ఇన్‌చార్జి ఉప్పాల రాము చేతుల మీదుగా నరసింహస్వామితో పాటుగా ముదునూరి నరేష్, బత్తిన బాబి తదితరులు పార్టీ కండువా కప్పుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గూడూరు ఎంపీటీసీగా బత్తిన నరసింహస్వామి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ఆకర్షితుడై వైఎస్సార్ సీపీలోకి వస్తున్నట్లు స్వామి తెలిపారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పెడనలో ఉప్పాల రాము విజయానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఉప్పాల రాము మాట్లాడుతూ వైఎస్సార్ సీపీలోకి వచ్చిన నాయకులకు ప్రాధాన్యం, గుర్తింపు ఇస్తామన్నారు. ప్రస్తుతం పార్టీలో ఉన్న నాయకులు, కొత్తగా వచ్చే వారిని సమన్వయం చేసుకుని పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగా మధు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ మోటేపల్లి రత్నారావు, గూడూరు పీఏసీస్ చైర్మన్ కారుమంచి కామేశ్వరరావు, ఆకూరిశ్రీను, లింగం విజయ్‌తదితరులు పాల్గొన్నారు.



పార్టీ కండువా కప్పి బత్తిన స్వామిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఉప్పాల రాము

తాగునీటి సమస్య పరిష్కారం

బంటుమిల్లి: మండల పరిధిలోని సాతులూరులో జెడ్పీ 15వ ఆర్థిక సంఘ నిధులతో మరమ్మతులు చేసిన బోరు, మోటారును శనివారం సర్పంచ్ గొల్ల బాలస్వామి, మాజీ సర్పంచ్ చోడవరపు రాధాకృష్ణ ప్రారంభించి తాగునీరు విడుదల చేశారు. వివరాల్లోకి వెళితే సాతులూరు గ్రామం బంటుమిల్లి ప్రధాన కాలువకు సమీపంలో ఉన్న గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. గ్రామంలో రక్షిత మంచినీటి పథకం ఫిల్టరు బెడ్లు మరమ్మతులకు గురవడం, బోరు, మోటారు దెబ్బతినడంతో గ్రామస్తులు ఊట బావులపై ఆధారపడ్డారు. ఈ క్రమంలో గ్రామంలో నిర్వహించిన ప్రజాదీవెనలో గ్రామస్తులు తాగునీటి సమస్యను వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి రాము దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన ఆయన జెడ్పీ గ్రాంటు 15వ ఆర్థిక సంఘ నిధులు రూ. 5 లక్షలు కేటాయించారు. ఈ నిధులతో సర్పంచ్ గొల్ల బాలస్వామి, మాజీ సర్పంచ్ చోడవరపు రాధాకృష్ణ పాత బోరుకు మరమ్మతులు చేయించి కొత్తగా సబ్‌మెర్సిబుల్ మోటారును ఏర్పాటు చేశారు. దీర్ఘకాలంగా ఉన్న తాగునీటి సమస్య పరిష్కారానికి నిధులు మంజూరు చేసిన జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఇచ్చిన హామీని నిలుపుకున్న ఉప్పాల రాముకు గ్రామస్తులు ధన్యవాదాలు తెలుపుతున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళి

నాగాయలంక: అమరజీవి పొట్టి శ్రీరాములుకు పలుచోట్ల నివాళులర్పించారు. గ్రామంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో శనివారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకను మండల శ్రీఆర్యవైశ్యసంఘం, వాసవీ సేవాదళ్ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. తొలుత నాగాయలంక ఎస్‌ఐ ఎం.సుబ్రహ్మణ్యం, పొట్టి శ్రీరాములు విగ్రహానికి, మండల వీర్వోల సంఘం అధ్యక్షుడు టి.జి. సాయిబాబు గాంధీజీ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. సంఘం ఆర్థిక సౌజన్యంతో బాటసారులకు 200 లీటర్ల మజ్జిగను ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం పంపిణీ చేశారు. కన్యకా పరమేశ్వరి దేవస్థానం కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు, మండల ఆర్య వైశ్యసంఘం అధ్యక్షుడు చిట్టా శివనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కోనేరుసెంటర్: జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వరరావు పూలమాలవేసి నివాళులు అర్పించారు.

పెడన: పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యాన జాతిపిత మహాత్మాగాంధీ, అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక వాసవి ప్రార్థనా మందిరంలో అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతిని పురస్కరించుకుని అఖిల భారత ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లూరి చిన్నా ఆధ్వర్యంలో పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు కొల్లిపర శ్రీనివాసరావు విగ్రహాలను ఏర్పాటు చేశారు. విగ్రహాలను కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సన్నిధి నాగసాయి, ఏపీ ఆర్యవైశ్య మహాసభ సేవా కార్యక్రమాల కమిటీ చైర్మన్ మామిడి వెంకట వరప్రసాద్ ఆవిష్కరించారు. సంఘ నాయకులు ఇమ్మడి నాగపోతరావు, ఆత్మకూరు సురేష్‌కుమార్, కొల్లూరి రాజా తదితరులు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఏఎస్పీ వెంకటేశ్వరరావు

మోపిదేవి: ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద పొట్టి శ్రీరాముల విగ్రహానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రామాంజనేయులు నివాళులర్పించారు.

పెడన: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో చైర్‌పర్సన్ కటకం నాగకుమారి ప్రసాద్ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మహ్మద్ ఖాజా, కమిషనర్ బి.వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

కోడూరు: పొట్టి శ్రీరాములు జయంతిని పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు ఘనంగా నిర్వహించారు. శ్రీరాములు చిత్రపటానికి మెరైన్ సీఐ రామ్మోహన రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కోనేరుసెంటర్: పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఎస్ ఎస్ ఎస్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి కేయూ రిజిస్ట్రార్ ఆచార్య శోభన్‌బాబు పూలమాలలు వేశారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రధాన ఆచార్యుడు సుందరకృష్ణ, ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాంబాబు పాల్గొన్నారు.

చల్లపల్లి: స్థానిక ఆర్యవైశ్య సంఘ భవనంలో శ్రీరాములు చిత్రపటానికి సంఘ అధ్యక్షుడు అన్నవరపు పాండురంగారావు, కార్యదర్శి వరదా హరిగోపాల్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



నాగాయలంకలో నివాళులర్పించిన ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం, వీఆర్వో సాయిబాబు



పాలకాయతిప్పలో మెరైన్ సిబ్బంది ర్యాలీ



మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

మచిలీపట్నంటౌన్: నగరంలోని కోటి సెంటరు వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి వాసవీక్లబ్, వాసవీ వనిత క్లబ్, వాసవీ కపుల్స్‌క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ శ్రీకాకోళపు రేణుకారాణి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు రెడీ

- మండలంలో పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్న 446మంది విద్యార్థులు
- మూడు పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు

నాగాయలంక: మండలంలో సోమవారం నుంచి నిర్వహించే పదో తరగతి పరీక్షలకు 446మంది హాజరుకానున్నట్లు ఎంఈవో-1 టీవీఎస్ రామదాసు, ఎంఈఓ-2 అన్నపరెడ్డి రామదాసు శనివారం తెలిపారు. మండల పరిధిలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ప్లస్‌లో నాగాయలంక-ఏ(180మంది), నాగాయలంక-బీ(154మంది)సెంటర్లు తలగడదీవి జెడ్పీ ఉన్నత పాఠశాల(112 మంది) పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశమని అధికారులు పేర్కొన్నారు. మూడు కేంద్రాల్లో.. నాగాయలంక, భావదేవరపల్లి, ఏటిమొగ, తలగడదీవి జెడ్పీ ఉన్నత పాఠశాలలు, ఎదురుమొండి అప్‌గ్రేడ్ హైస్కూల్, రెండు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారు. మూడు కేంద్రాల్లో విద్యార్థులకు 20 గదులు కేటాయించగా, 23మందిని ఇన్విజిలేటర్లుగా, ముగ్గురు ఛీఫ్ సూపరింటెండెంట్‌లు, మరో ముగ్గురు డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించారు. విద్యార్థులు సకాలంలో పరీక్షలకు హాజరుకావాలని అధికారులు సూచించారు.